ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

శనివారం 26 జూలై 2025



దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ప్రోత్సాహకం కోసం జిల్లాలో అర్హులైన దివ్యాంగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాకు మొత్తం 17 యూనిట్లు మంజూరు అయ్యాయని, ఇందులో 50వేల చొప్పున 14 యూనిట్లు, లక్ష యూనిట్‌లో 80శాతం రాయితీతో 1, రెండు లక్షల యూనిట్ 70శాతం రాయితీతో 1, మూడు లక్షల యూనిట్ 60 శాతం రాయితీతో 1 చొప్పున ఉన్నాయని పేర్కొన్నారు. వీటికి అర్హులైన దివ్యాంగులు ఈనెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

జిల్లాలో మోస్తరు వర్షం

- ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లోకి వరద నీరు



సిరిసిల్లలో రోడ్లపై వరద నీరు..

సిరిసిల్ల జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాలుగు రోజులుగా వర్షాలు దంచి కొడుతుంటే రాజన్న సిరిసిల్ల జిల్లాలో మాత్రం మోస్తరుగానే వర్షాలు కురుస్తున్నాయి. జడివాన జాడే లేకపోవడంతో ఇంకా చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు వెలవెలబోతున్నాయి. కొద్దిమేరకు కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులు, చెరువులు కుంటలోకి వరద నీరు చేరుతోంది. జిల్లాలోని ప్రధానమైన సిరిసిల్ల మానేరువాగులో కొన్నిచోట్ల వరద నీరు ప్రవహిస్తుండగా, మూల వాగు జలకళతో ప్రవహిస్తోంది. జిల్లాలో శుక్రవారం ఉదయం వరకు 6.4మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. వీర్నపల్లి 13.9 మిల్లీమీటర్లు, కోనరావుపేటలో 12.2, సిరిసిల్లలో 9.2, తంగళ్ళపల్లిలో 8.6, వేములవాడలో 7.4, ఇల్లంతకుంటలో 6.9, ముస్తాబాద్‌లో 6.1, ఎల్లారెడ్డిపేటలో 5.8, బోయిన్‌పల్లిలో 3.3, వేములవాడ రూరల్ 3.2, గంభీరావుపేటలో 2.7, చందుర్తిలో 2.3, రుద్రంగిలో 1.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శుక్రవారం సాయంత్రం తేలికపాటి వర్షం కురిసింది.సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పలు ప్రాంతాల్లో రోడ్లపై వరద నీరు ప్రవహించింది. కాగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ముస్తాబాద్‌లో 30.0 మిల్లీమీటర్లు, ఎల్లారెడ్డిపేటలో 28.0, తంగళ్లపల్లిలో 21.3, గంభీరావుపేటలో 16.5, వీర్నపల్లి 16.3, ఇల్లంతకుంటలో 16.0, సిరిసిల్లలో 11.5, కోనరావుపేటలో 7.0, రుద్రంగిలో 5.0, చందుర్తిలో 3.8, వేములవాడలో 3.8, వేములవాడ రూరల్ 3.5, బోయిన్‌పల్లిలో 1.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

జిల్లాలో వర్షాకాలం సీజన్లలో 310.5 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి 284.6 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. జిల్లాలోని శ్రీరాజరాజేశ్వర మిడ్‌మానేరు ప్రాజెక్టులోకి మానేరు, మూలవాగుల నుంచి 955 క్యూసెక్కుల నీరు చేరుతోంది. ప్రాజెక్టులో 27.55 టీఎంసీల సామర్థ్యానికి 6.953 టీఎంసీల నీటి నిల్వ ఉంది. అన్నపూర్ణ ప్రాజెక్టు లోకి 100 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. ప్రాజెక్టులో 3.50 టీఎంసీలకు 1.24 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

అక్షరాస్యత వైపు అతివలు..





ఉల్లాస్‌యాప్‌లో నమోదైన స్వశక్తి సంఘాల్లోని సభ్యులు

మండలం	నిరక్షరాస్యులు	పదోతరగతి	ఇంటర్మీడియట్
బోయినపల్లి	599	13	10
చందుర్తి	673	31	47
ఇల్లంతకుంట	191	60	30
గంభీరావుపేట	598	166	209
కొనరావుపేట	1,003	329	272
ముస్తాబాద్	503	20	00
తంగళ్లపల్లి	468	16	02
రుద్రంగి	2,383	72	46
తంగళ్ళపల్లి	238	17	00
వీర్నపల్లి	511	25	08
వేములవాడ రూరల్	529	08	05
ఎల్లారెడ్డిపేట్	1,233	427	101
మొత్తం	8,929	1,184	722

- 'స్వశక్తి'లో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చే లక్ష్యం
- 'ఉల్లాస్' పేరిట ప్రత్యేక కార్యక్రమం అమలుకు ఏర్పాట్లు
- సెర్ప్, విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహణ
- జిల్లాలో 21,894 మంది మహిళలు..

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

అక్షరాలు నేర్వని అతివలకు కనీసం చదవడం, రాయడం, అంకెలు గుర్తించడం, కూడికలు వంటి లెక్కలు నేర్పిం చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో సెర్ప్, విద్యాశాఖ సంయుక్తంగా ఉల్లాస్(అండర్ స్టాండింగ్ లైఫ్‌లాంగ్‌లెర్నింగ్ ఆన్‌సొసైటీ)పేరిట ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దశలవారీగా అమలు చేసే ఉల్లాస్ కార్యక్రమంలో ముందుగా మహిళాస్వశక్తి సంఘాల్లో నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా మార్చడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో సెర్ప్‌సిబ్బంది క్షేత్రస్థాయిలో నిరక్షరాస్యులైన మహిళలను గుర్తిస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో నిరక్షరాస్యులను గుర్తించి ఉల్లాస్ యాప్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు.

జిల్లాలో 1.15 లక్షల మంది స్వశక్తి సభ్యులు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 10,008 స్వశక్తి సంఘాలు ఉండగా, 1.15లక్షల మంది సభ్యులు ఉన్నారు. వీరిలో 21,894మంది మహిళలు నిరక్షరాస్యులుగా ఉన్నట్లు గురించారు. ఇందులో బోయినపల్లిలో 2,422మంది, చందుర్తిలో 1,294మంది, ఇల్లంతకుంటలో 2,399మంది, గంభీరావుపేటలో 2,395మంది, కోనరావుపేటలో 2,372మంది, ముస్తాబాద్‌లో 2,354మంది, రుద్రంగిలో 1,274 మంది, తంగళ్ళపల్లిలో 2,382 మంది, వీర్నపల్లిలో 1,294 మంది, వేములవాడలో 1,326 మంది, వేములవాడ రూరల్‌లో 1,096 మంది, ఎల్లారెడ్డిపేటలో 1,286 మంది నిరక్షరాస్య మహిళలున్నారు. ఇప్పటి వరకు 8,929 మంది మహిళలను ఉల్లాస్‌యాప్‌లో నమోదు చేశారు.

ఓపెన్ స్కూలింగ్ విధానం అమలు..

కేంద్ర ప్రభుత్వం అక్షరాస్యతను పెంచే దిశగా శ్రీకారం చుట్టిన ఉల్లాస్ కార్యక్రమం ఓపెన్ స్కూలింగ్ విధానంలో జరగనుంది. కేంద్ర ప్రభుత్వం 2009లో సాక్షర భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించి పదేళ్ల కాలం కొనసాగించింది. తర్వాత 2020లో కొత్త విద్యా విధానం అమల్లోకి తెచ్చింది. 2022 నుంచి 2027 వరకు వివిధ కార్యక్రమాలు ..

- మిగతా 8లో

నేడు రహీంఖాన్‌పేటకు ఎమ్మెల్యే రాక..

ఇల్లంతకుంట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రహీంఖాన్‌పేట ఆదర్శ పాఠశాలకు శనివారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వస్తున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలల్లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఆన్‌లైన్ తరగతులను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్టీసీ బస్సు రేట్ల తగ్గింపు..

వేములవాడ టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శుభకార్యాలు, పెళ్ళిళ్లకు ఆర్టీసీ బస్సులు బుక్ చేసుకునే వారికి భారీ తగ్గింపును అందిస్తున్నట్లు వేములవాడ డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. శుభకార్యాలకు, తీర్థయాత్రలకు ఆర్టీసీ బస్సు బుక్ చేసుకునే వారికి 20శాతం ధరలు తగ్గిస్తున్నామన్నారు. కిలోమీటర్‌కు పల్లెవెలుగు బస్సుకు రూ.52, ఎక్స్‌ప్రెస్‌కు రూ.62, డీలక్స్‌కు రూ.57, సూపర్ లగ్జరీకి రూ. 59 ధరలు నిర్ణయించినట్లు తెలిపారు. గతంలోని ధరలకంటే 20 శాతం ధరలు తగ్గించామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కురుమ సంఘం పట్టణ అధ్యక్షుడిగా బాలరాజు

వేములవాడ టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణ కురుమ సంఘం అధ్యక్షుడిగా ఈరు బాలరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం నాయకులు ఒక ప్రకటనలో వెల్లడించారు. పట్టణంలోని భీమేశ్వర గార్డెన్‌లో నిర్వహించిన ఎన్నికల్లో బాలరాజును ఏకగ్రీవంగా ఎన్నుకోగా, ఉపాధ్యక్షుడిగా ఏనుగు కృష్ణ, ప్రధానకార్యదర్శిగా గాజర్ల మల్లేశం, సహాయకార్యదర్శింగా మ్యాకల మల్లేశం, కోశాధికారిగా మ్యాకల శ్రీనివాస్, సలహాదారుగా గుంటి కనుకయ్య, కార్యవర్గ సభ్యులుగా కిషన్, ఏగుర్ల ఎల్లయ్య, ఏనుగు శ్రీనివాస్, కంబల్ల పర్శరాములు, ఏనుగుల అంజయ్య, గడ్డం బాలమణి, మ్యాకల రజితమహేందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. నాగం కుమార్, ఒల్లెం నాగరాజు, ఏనుగుల కనుకయ్య, జక్కుల తిరుపతి, మ్యాకల పర్శరాములు, దండు వినోద్, మ్యాకల మల్లేశం, గుంటి కనుకయ్య, సంబ లచ్చయ్య ఉన్నారు.

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి : కలెక్టర్



రైతులకు యూరియాను అందిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

వీర్నపల్లి, జూలై25(ఆంధ్రజ్యోతి):మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. వీర్నపల్లి మండలం వన్‌పల్లిలో ఇందిర మహిళా శక్తి ద్వారా శ్రీవర్షిణి గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల విక్రయ దుకాణాన్ని జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్‌బేగంతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం యూరియా కొనుగోలు చేసిన రైతులకు బస్తాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇందిరా మహిళ శక్తి కింద స్వశక్తి సంఘాల సభ్యుల ఆర్థిక ఎదుగుదల కోసం క్యాంటీన్లు, డైరీ యూనిట్లు, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, రైస్‌మిల్లులు, ఇతర స్వయం ఉపాధి యూనిట్లను అందించినట్లు పేర్కొన్నారు. మారుమూల అటవీప్రాంత రైతులకు స్థానికంగా ఫర్టిలైజర్ దుకాణాలు అందుబాటులోకి తీసుకు రావడమే లక్ష్యంగా మండలంలో రెండు దుకాణాలు మంజూరైనట్లు తెలిపారు.

పాఠశాలలో పిచ్చి మొక్కలను తొలగించాలి...

గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను, అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీచేశారు. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడి, రిజిస్టర్లను తనిఖీ చేశారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి..

వీర్నపల్లి మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేందాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. సిబ్బంది విధుల రిజిష్టర్, ఓపి రిజిష్టర్, మందుల పంపిణీ రిజిష్టర్‌లను పరిశీలించారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి స్నేహకు సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. గత నవంబర్ నెలలో శంకుస్థాపన చేసిన పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులను ప్రారంభించక పోవడంతో ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫోన్ చేసి పనులను ప్రారంభించాలని ఆదేశించారు.

దివ్యాంగురాలి సమస్యల వెంటనే పరిష్కరించిన కలెక్టర్...

వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామంలో దివ్యాంగురాలైన లింగంపల్లి సుజాత అనే మహిళ తన ఇంటికి వెళ్లడానికి మురికి నీటి నాలా అడ్డుగా ఉందని, మంచి నీటి కనెక్షన్ ఇవ్వలేదని. పెంకుటిల్లు కూలిపోతుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు విన్నవించింది. దీంతో దివ్యాంగురాలైన ఆమె ఆరోగ్య పరిస్థితిని గమనించిన కలెక్టర్ వెంటనే స్పందించి నాలాపై పైపులు వేసి సిమెంట్ దిమ్మెను ఏర్పాటు చేసి. మిషన్ భగిరథ ద్వారా నల్లా కనెక్షన్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల గ్రామ కమిటీ ఇలాంటి సమస్యలున్న పేదవారిని పరిశీలించి ప్రతిపాదనలు పంపించాలన్నారు. త్వరలోనే ఇందిరమ్మ ఇంటిని అందిస్తామని ఆమెకు హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాబివృద్ధి అధికారి శేషాద్రి, వ్యవసాయ అధికారి అఫ్జల్‌బేగం, ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్, వైస్ చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, ఐకేపి డీపీఎం పద్మయ్య, మణికొరెడ్డి, ఏపీఎం నర్సయ్య, మండల వ్యవసాయాధికారి జయ, ఎంపీడీవో బీరయ్య, ఎంఈవో తుమ్మ శ్రీనివాస్, ఆర్ఐ శివకుమార్, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, సీసీ శ్యామల, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తిరుపతి యాదవ్, వర్షిని వీవోఏ దేవలక్ష్మి, అధ్యక్షురాలు రేణుక, కార్యదర్శి శిరీష, ఏఎంసీ డైరెక్టర్లు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వాడినా, సరఫరా చేసినా సమాచారం ఇవ్వాలి

సిరిసిల్ల టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పరిసరాలను గమనిస్తూ ఉండాలని, ఎవరైనా డ్రగ్స్ వాడినా, సరఫరా చేసిన సమాచారం ఇవ్వాలని సిరిసిల్ల ఎస్సై వినీతరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సెస్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల నిరోధక కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వినీతరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఎవరైనా ఇబ్బందులు పడితే తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో ట్రోల్‌ఫ్రీ నంబర్ 1908కు సమాచారం అందించాలన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల వినియోగంవల్ల జరిగే అనర్థాలు వివరించారు. అనంతరం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ వనజకుమారి, అధ్యాపకులు మురళీ, సీతారాము, కే సునీత, శ్రీనివాస్, అఫ్రోజ్ సుల్తానా, ప్రవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేర పరిశోధనలో జాగిలాల పాత్ర కీలకం : ఎస్పీ



జాగిలాల సంరక్షణ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ మహేశ్ బి. గీతే

సిరిసిల్ల క్రైం, జూలై 25(ఆంధ్రజ్యోతి): నేర పరిశోధనలో జాగిలాల పాత్ర కీలకమని ఎస్పీ మహేశ్ బి. గీతే అన్నారు. శుక్రవారం సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో నూతనంగా నిర్మించిన జాగిలాల సంరక్షణ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ జాగిలాలను నేర పరిశోధన, భద్రతా చర్యలు, మాదక ద్రవ్యాల నియంత్రణ, విపత్తు పరిస్థితుల్లో ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. శిక్షణా సామర్థ్యం వల్ల విభిన్న ఆపరేషన్లలో జాగిలాలను వినియోగిస్తున్నామన్నారు. పోలీస్‌జాగిలాల సంరక్షణకు ప్రత్యేకంగా గదులను నిర్మించామన్నారు. విశ్వాసానికి మారుపేరుగా నిలిచే జాగిలాలు పోలీస్‌శాఖకు కీలకంగా మారాయన్నారు. హత్యలు, దోపిడీలు, దొంగతనాలు జరిగిన సమయంలో నిందితులను పట్టించడంలోనూ, సంఘ విద్రోహులు అమర్చే పేలుడు పదార్థాలను గుర్తించి భారీ ప్రాణ, ఆస్తి నష్టం నివారించడంలో అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నాయన్నారు. మాదక ద్రవ్యాలు, బాంబులు, ఇతర అనుమానస్పద వస్తువులను గుర్తించడంలో చాలా ఉపయోగకరంగా ఉంటాయన్నారు. జిల్లాలో అనేక కేసులను చేధించడంలో, ఆధారాల సేకరణలోనూ వీటి పనితీరు ప్రశంసనీయమన్నారు. పోలీస్ జాగిలాలకు ఆధునాతన శిక్షణ, వైద్య సంరక్షణ, తగిన సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నాలుగు జాగిలాలు ఉన్నాయన్నారు. వీటి నిర్వహణ కోసం ప్రత్యేక శిక్షణ పొందిన హ్యాండ్లర్స్ ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐలు కృష్ణ, మొగిలి, నటేశ్, ఆర్ఐలు రమేశ్, యాదగిరి, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డాగ్స్ హ్యాండ్లర్స్ పాల్గొన్నారు.

30న మాదిగల ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు దేవదాస్

సిరిసిల్ల టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో ఈనెల 30న మాదిగల ఆత్మీయ సమ్మేళన సభ ఉంటుందని అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్ అన్నారు. మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో తెలంగాణ మంత్రి వడ్లూరి లక్ష్మన్‌కుమార్‌తో పాటు ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు సన్మానం చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి హాజరు అవుతున్నారని అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో మాదిగల ఆత్మీయ సమ్మేళన సభ జరగాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల ఈనెల 30కి వాయిదా పడిందన్నారు. జిల్లాలోని మాదిగ సామాజిక వర్గానికి చెందిన నాయకులు, మహిళలు, ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదిగల ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయాలని అన్నారు. ఈ సమావేశం సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, దళిత నాయకులు అంకని భాను, నేదూరి లక్ష్మన్, నక్క నర్సయ్య, బొడ్డు నారాయణ, గొల్లపల్లి పరశురాములు, వంతడుపుల రాము, తంగళ్ళపల్లి దేవయ్య ఆకునూరి బాలకిషన్, గడ్డం కిరణ్, అకునూరి ప్రవీన్, గడ్డం ప్రసాద్, గడ్డం హనుమాన్లు, కొంపెల్లి శ్రీనివాస్, బొడ్డు రమేష్, రాళ్లపల్లి కళ్యాన్, బట్టు ప్రసాద్, ఆకునూరి దేవయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


అజయ్(ఫైల్)

తిమ్మాపూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. మన్నెంపల్లి గ్రామానికి చెందిన ధరిపల్లి సతీష్, వాణి దంపతుల కుమారుడు ధరిపల్లి అజయ్ (20) కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు మెడికల్ కళాశాలలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 21న కొత్తపల్లిలో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లిన అజయ్‌ని డ్యూటీకి ఎందుకు సరిగా వెళ్లడం లేదని వారు మందలించారు. దీంతో అజయ్ అక్కడి నుంచి వెళ్లి మన్నెంపల్లి శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

మహిళ అదృశ్యం

చందుర్తి జూలై 25 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన గెంట్యాల అఖిల అనే మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై రమేష్ శుక్రవారం తెలిపారు. ఎస్ఐ రమేష్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన అఖిల గురువారం ఉదయం వేములవాడలో కిరాణం సామాను తీసుకురావడానికి వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో ఫోన్‌చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. చుట్టుపక్క వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్ట్


గంజాయి విక్రేతలను అరెస్ట్ చూపుతున్న రూరల్ సిఐ మొగిలి

సిరిసిల్ల క్రైం, జూలై 25(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ముస్తాబాద్ మండలంలోని గూడెం గ్రామానికి చెందిన సూర అజయ్(19), సూర ప్రదీప్(18)లను శుక్రవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపారు. గూడెం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు గంజాయికి అలవాటు పడిన వారికి అధిక ధరలకు విక్రయిస్తూ వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా గూడెం పెద్దమ్మ దేవాలయం వద్ద ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు ముస్తాబాద్ ఎస్ఐ గణేశ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేయగా వారి వద్ద 109 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించామన్నారు. గంజాయి సేవించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవన్నారు.

● పెద్దపల్లి టౌన్ : పెద్దపల్లి రైల్వే స్టేషన్ ఏరియాలో శుక్రవారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా పోలీసులను చూసి పారిపోతున్న ఇద్దరిని పట్టుకుని విచారించారు. రేకుర్తి గ్రామానికి చెందిన బండారి శివకుమార్, జంగపల్లి రామ్‌చరణ్‌లను అదుపులోకి తీసుకొని 5 వేల విలువ చేసే గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

గాంధీభవన్‌లో వినతులు స్వీకరించిన కవ్వంపల్లి


గాంధీభవన్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

తిమ్మాపూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): హైదారాబాద్‌లోని గాంధీభవన్‌లో శుక్రవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించినట్లు తిమ్మాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ క్యారాలయం ఒక ప్రకటనలో తెలిపింది. గాంధీభవన్‌లో ఇప్పటి వరకు మంత్రులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తుండగా తాజా గా పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సూచన మేరకు ప్రతి రోజు ఇద్దరు ప్రజా ప్రతినిధులు గాంధీభవన్‌లో అందుబాటులో ఉండి వినతులు స్వీకరిస్తున్నట్లు ప్రకటనలో తెలిపారు.

అరచేతిలో పాఠ్యాంశాలు



దీక్ష యాప్‌తో విద్యార్థులకు ప్రయోజనం
అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కరీంనగర్ టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): చదువులో రాణించే విద్యార్థులు వివిధ కారణాలతో ఒకటి, రెడు రోజులు పాఠశాలకు వెళ్లకపోతే పాఠాల్లో వెనకబడిపోతారు. వారు ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితులు ఏర్పడుతుంటాయి. తిరిగి చదవాలన్నా సరిగా అర్థం కాక ఇబ్బందులు పడుతుంటారు. ఇలాంటి వారి కోసం రాష్ట్ర విద్యాశాఖ దీక్ష యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇందులో భాగంగా ఒకటి నుంచి పదో తరగతి పాఠ్యపుస్తకాలను క్యూఆర్ కోడ్‌తో ప్రచురించింది. దీని ఆధారంగా విద్యార్థులు చదువుల్లో రాణించవచ్చు.

క్యూఆర్ కోడ్ సాయంతో...

ఒకటి నుంచి పదో తరగతి పాఠ్యాంశాలపై పూర్తిగా పట్టు సాధించేలా విద్యాశాఖ యాప్‌ను రూపొందించింది. స్మార్ట్ ఫోన్‌లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని అర్థం కాని పాఠ్యాంశాన్ని చదివే వెసులు బాటు కల్పించింది. మొదట యాప్‌లోకి వెళ్లి అడిగిన వివరాలను నమోదు చేయాలి. పాఠ్య పుస్తకంపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే సెల్ ఫోన్‌లో కోరుకున్న పాఠ్యాంశాన్ని పొందవచ్చు. వివిధ రూపాల్లో విద్యార్థుల మానసిక స్థాయికి తగినట్లు దృశ్య రూపకంగా బోధన సాగుతుంది. నవ్యత కోరే ఉపాధ్యాయులకు సృజనాత్మకంగా బోధించే విధానాలు కూడా ఇందులో ఉన్నాయి. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పాఠ్యాంశాల అధ్యయనం, బోధనలో మెరుగులు దిద్దే ఈ విధానాన్ని అందిపుచ్చుకుంటే ఉపయుక్తంగా ఉంటుంది.

విద్యార్థులకు అవగాహన..

విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులకు ఉపకరించేలా ప్రభుత్వం దీక్ష యాప్‌ను రూపొందించింది. క్యూఆర్ కోడ్ సహాయంతో ఇంటి వద్ద పాఠాలను తిరిగి చూసుకోవచ్చని ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీనిపై విద్యార్థులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నామంటున్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, చదువుల్లో మరింత రాణించాలని సూచిస్తున్నారు.



కేజీవీల్ ట్రాక్టర్‌కు జరిమానా

ఎలిగేడు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో నిబంధనలు అతిక్రమించి కేజీవీల్ ట్రాక్టర్‌ను రోడ్డుపై తీసుకెళ్లిన గడ్డం రామిరెడ్డికి జరిమానా విధించారు. శుక్రవారం నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై వెళుతుండగా పెట్రోలింగ్ పోలీసులు టీఎస్22బి3667 నెంబర్ గల ట్రాక్టర్‌ను పట్టుకుని తహసీల్దార్‌కు బైండోవర్ చేశారు. తహసీల్దార్ రూ.5 వేల జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ రైతులు, ట్రాక్టర్ డ్రైవర్లకు ఈ విషయంలో పలు సూచనలు చేసినట్లు తెలిపారు. కేజీవీల్స్ వల్ల రోడ్లు దెబ్బతింటాయన్నారు.

విద్యుదాఘాతంతో ఆరు గొర్రెల మృత్యువాత

శంకరపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మెట్‌పల్లిలో విద్యుదాఘాతంతో ఆరు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. బాకారపు మొండయ్య శుక్రవారం రోజు లాగానే గొర్రెలను మేపడానికి వెళ్లాడు. మెట్‌పల్లిలో ఓ పురాతన ఇంటి వద్ద గొర్రెలు గడ్డి మేస్తూ ప్రమాదవశాత్తు తెగివున్న విద్యుత్ వైర్‌ను తాకడంతో విద్యుదాఘాతంతో మృతి చెందాయి.

హుజూరాబాద్ ఎంజేపీ గురుకులంలో కలకలం

● ఇద్దరు విద్యార్థులను కరిచిన ఎలుకలు ● ఏరియా ఆస్పత్రిలో చికిత్స

హుజూరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఎంజేపీ గురుకులం హాస్టల్‌లో ఎలుకలు కలకలం సృష్టించాయి. పాఠశాలలోని ఇద్దరు విద్యార్థులను ఎలుకలు కరవడంతో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సైదాపూర్ మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ హాస్టల్‌ను హుజూరాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేశారు. గురువారం అర్ధరాత్రి హాస్టల్‌లోని 8వ తరగతి చదువుతున్న రక్షిత్, 9వ తరగతి చదువుతున్న యశ్వంత్‌లను ఎలుకలు కరిచాయి. ఈ విషయాన్ని ఉదయం పాఠశాలకు వచ్చిన ప్రిన్సిపాల్‌కు విద్యార్థులు తెలుపడంతో వెంటనే ఆ ఇద్దరితో పాటు హాస్టల్ గదిలో ఉన్న 10మంది విద్యార్థులను హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ రాణిని వివరణ కోరగా హాస్టల్‌కు సమీపంలో రైస్ మిల్లులు ఉండడంతో ఎలుకలు హాస్టల్‌లోకి వస్తున్నాయన్నారు. ఎలుకల నివారణ కోసం బోన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థులు క్షేమంగా ఉన్నారన్నారు.


హుజూరాబాద్‌లోని ఎంజేపీ గురుకుల పాఠశాల

● గురుకులాలకు నూతన భవనాలు నిర్మించాలి

రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలలకు నూతన భవనాలు నిర్మించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము అన్నారు. శుక్రవారం హుజూరాబాద్ పరిధిలోని బీసీ గురుకుల విద్యాలయాలను, సంక్షేమ హాస్టళ్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల సంక్షేమ హాస్టళ్లు అద్దె భవనాల్లో నడుస్తున్నాయన్నారు. గురుకులాలు అపరిశుభ్రంగా ఉండడం వల్ల ఎలుకలు హాస్టళ్లలోకి వచ్చి విద్యార్థులను కరుస్తున్నాయన్నారు.

● విచారణ చేపట్టిన అధికారులు

హుజూరాబాద్ పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల హాస్టల్‌లో శుక్రవారం రాత్రి అధికారులు విచారణ చేపట్టారు. హాస్టల్‌లోని విద్యార్థుల గదులను పరిశీలించారు. రెండు రోజుల్లో పది మంది విద్యార్థులను ఎలుకలు కరిచినట్లు నిర్ధారించుకున్నారు. హాస్టల్ పరిసర ప్రాంతాలు అభరిశుభ్రంగా ఉన్నాయని, దీంతో హాస్టల్‌లోకి ఎలుకలు వస్తున్నాయన్నారు. దీనిపై అధికారులకు నివేదిక ఇస్తామని మహాత్మా జ్యోతిరావు పూలే జాయింట్ సెక్రటరీ తిరుపతి తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

కవాడిగూడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన దోమలగూడ పీఎస్ పరిధిలోని ట్యాంక్‌బండ్‌పై జరిగింది. ఏఎస్ఐ చెలమయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్లలో నివాసం ఉండే శ్రీనివాస్ (50)కు మతిస్థిమితం సరిగా లేదు. చికిత్స నిమిత్తం ఆయన కుమారుడు ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రికి తీసుకువస్తుండగా ట్యాంక్‌బండ్‌పై ఉన్న వేమన విగ్రహం వద్ద కుటుంబ సభ్యులకు చెప్పకుండా శ్రీనివాస్ తప్పిపోయాడు. అతని కోసం కుటుంబ సభ్యులు ఎంతవెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి మిస్సింగ్‌పై ఆయన కుమారుడు దోమలగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ చెలమయ్య తెలిపారు. శ్రీనివాస్ ఆచూకీ తెలిసిన వారు దోమలగూడ పీఎస్‌లో గానీ, ఫోన్ 8712568855కు సమాచారం అందించాలని ఏఎస్ఐ చెలమయ్య తెలిపారు.

నాలుగు నెలలుగా అందని 'ఉపాధి' వేతనాలు


పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

గంగాధర, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ సిబ్బందికి నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదు. గంగాధర మండలంలో 33 గ్రామ పంచాయతీలున్నాయి. ప్రతి గ్రామ పంచాయతీకి ఒక ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌తో పాటు మండలంలో ఏపీవో, ఈసీలు, టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఇతర సిబ్బంది ఉన్నారు. అయితే మండలంలో ప్రతి గ్రామ పంచాయతీకి ఒక ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలి. ప్రస్తుతం గంగాధర మండల వ్యాప్తంగా 17 మంది ఫీల్డ్ అసిస్టెంట్లతోనే కాలం వెల్లదీస్తున్నారు. గ్రామంలో ఉపాధి హామీ పనులను కూళీలలను నియమించి చేయించాలి. ఎఫ్ఏలు మస్టర్లలో పని వివరాలతో పాటు కూలీల సంఖ్య, కొలతలు, గ్రామంలో నర్సరీల పర్యవేక్షణ, చెట్ల పెంపకం, గ్రామ సభలు నిర్వహించి పనులను గుర్తించడం, సభల్లో రైతుల దరఖాస్తు చేసుకున్న పనులను కంప్యూటర్లలో నమోదు చేయించాల్సి ఉంటుంది. అది గాక చేసిన పనులను ఎంబీ రికార్డు చేసి ఇంజనీరింగ్ కన్సల్టెన్సీకి నివేదించాల్సి ఉంటుంది. పనిభారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. దీనికి తోడు నాలుగు నెలలుగా ఉపాధి హామీలో పనిచేస్తున్న సిబ్బందికి జీతాలు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

●సంవత్సర కాలంగా ఏపీవో పోస్టు కాళీ: గంగాధరలో సంవత్సరం నుండి ఏపీవో లేక ఈసీకి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ పనిచేసిన ఏపీవో దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్లగా సంవత్సర కాలంగా అదనపు బాధ్యతలు నిర్వహించాల్సి వస్తోంది.

ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ విచారణ చేపట్టాలి

భగత్‌నగర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ విచారణ చేపట్టాలని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఈ నెల 28న హైదరాబాద్‌లో సిట్ విచారణకు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ సైతం సిట్ విచారణకు హాజరవుతారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ పేరుతో సాగదీస్తోందని పేర్కొన్నారు.

బాలుడి ఆత్మహత్యాయత్నం

తంగళ్లపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లెకు చెందిన బాలుడు (16) పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తండ్రి మందలించాడని పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

మా సారూ మాకే కావాలి

కిషన్‌దాస్‌పేట ప్రాథమిక పాఠశాల వద్ద తల్లిదండ్రుల నిరసన


ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), జూలై25,(ఆంధ్రజ్యోతి): డిప్యూటేషన్‌పై మరో పాఠశాలకు పంపిన ఉపాధ్యాయుడిని తమ పాఠశాలకే తిరిగి కేటాయించాలని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కిషన్‌దాస్‌పేట ప్రాథమిక పాఠశాల ఎదుట తల్లిదండ్రులు శుక్రవారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. పాఠశాలలో సమావేశమైన విద్యార్థుల తల్లిదండ్రులు 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ప్రీప్రైమరీతో కలిపి 112మంది విద్యను అభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో కంటే విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. ఇక్కడ బోధించే ఉపాధ్యాయుడిని మరో పాఠశాలకు సర్దుబాటు చేయడంతో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు చదువును నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి ఉపాధ్యాయుడిని తిరిగి ఇదే పాఠశాలకు కేటాయించాలని కోరారు.

అప్పు వసూలుకు ఇంటికి తాళం వేశారని

అవమానభారంతో ఆత్మహత్య

శంకరపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నంలో అప్పు ఇచ్చిన వారి వేధింపులు భరించలేక అవమానంతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశవపట్నం గ్రామానికి చెందిన గుర్రం రామారావు (రాములు) (63) చిట్టీలు నిర్వహించే వాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన తనుకు ప్రకాష్, తనుకు లక్ష్మీనారాయణ వద్ద అవసరాల నిమిత్తం డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. దీనితో పాటు వారికి చిట్టీ సొమ్ము చెల్లించాల్సి ఉంది. వాటికి సంబంధించి వడ్డీ చెల్లిస్తున్నాడు. అయితే డబ్బులు మొత్తం ఇవ్వాలని వారు ఒత్తిడి చేస్తూ ఈ నెల 21న రామారావు ఇంటికి వచ్చి ఇంటికి తాళం వేశారు. దీనికి తోడు డబ్బు చెల్లించే పరిస్థితి లేక పోతే పురుగుల మందు తాగమని అవమానించారు. దీంతో మనస్థాపం చెంది శుక్రవారం ఉదయం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌లో జమ్మికుంట ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి భార్య గుర్రం కళావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

బురద రోడ్డుపై వరి నాట్లతో నిరసన


నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

వెల్గటూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం వెంకటాపూర్ రోడ్డు వర్షానికి బురదమయం కావడంతో శుక్రవారం గ్రామస్థులు రోడ్డుపై వరి నాటు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ చిరు జల్లులకే రోడ్డు బురదమయంగా మారుతోందని ఆవేదన చెందారు. కాలిబాటన, వాహనాలపై వెళ్లే వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రోడ్డుపై ప్రయాణించాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రోడ్డు బాగు చేయించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసిన పోలీసులు

హుజూరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణం బుడగజంగాల కాలనీలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులు మద్యం తాగుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు శుక్రవారం రాత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు విద్యార్థుల వసతి గదులను పరిశీలించారు. గదుల్లో మద్యం సీసాలు, సిగరెట్లు దర్శనమిచ్చాయి. దీంతో పోలీసులు విచారిస్తున్నారు. హాస్టల్‌లో రాత్రి వేళలో వార్డెన్ లేకపోవడం గమనార్హం.

బిల్లులు చెల్లించక నిలిచిన వంతెన నిర్మాణం

● యామాపూర్- ఫకీర్‌కొండాపూర్ గ్రామాల మధ్యలో వంతెన నిర్మాణం
● వర్షాకాలంలో విద్యార్థులు, రైతుల అవస్థలు


అర్ధంతరంగా నిలిచిన వంతెన నిర్మాణ పనులు

ఇబ్రహీంపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యామాపూర్-ఫకీర్ కొండాపూర్ గ్రామాల మధ్య నిర్మాణంలో ఉన్న వంతెన పనులు బిల్లులు చెల్లించకపోవడంతో నిలిచిపోయాయి. మండలంలోని ఫకీర్ కొండాపూర్ గ్రామానికి వెళ్లడానికి రెండు రోడ్డు మార్గాలు ఉన్నాయి. ఒకటి యామాపూర్ గ్రామం గుండా వెళ్లేదారి కాగా రెండోది మల్లాపూర్ మండలం నడికుడ గ్రామం నుంచి వెళ్లేది. ఈ రెండు రోడ్డుమార్గాల్లో లో లెవెల్ వంతెనలు ఉండడం వల్ల ప్రతీ వర్షాకాలంలో వాగుల వరద ఉధృతికి రాకపోకలు నిలిచిపోతాయి. దీంతో ప్రతీ వర్షాకాలం విద్యార్థులు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో లోలెవల్ వంతెన స్థానంలో హై లెవెల్ వంతెనల నిర్మాణానికి అప్పటి కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు రెండు కోట్ల 77 లక్షల 57వేల రూపాయలు ఆర్అండ్‌బీ నిధులతో వంతెన నిర్మాణానికి భూమిపూజ చేశారు. మెట్‌పల్లి పట్టణానికి చెందిన హిమాలయ కన్‌స్ట్రక్షన్ వారు కాంట్రాక్ట్ పనులు దక్కించుకొని వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. ఇప్పటివరకు వంతెన పిల్లర్ల నిర్మాణం పూర్తయింది. ఐనా ఒక్క రూపాయి కూడా బిల్లులు రావడం లేదని గుత్తేదారు నిర్మాణ పనులు ఆపేశారు. మళ్లీ ఎప్పటిలాగే ఈవర్షాకాలంలో కూడా వరదలు వచ్చి రాకపోకలు నిలిచిపోతాయోమోనని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈవంతెన నిర్మాణం పూర్తయితే పక్కనే ఉన్న నిర్మల్ జిల్లా ఖానాపూర్, కడెం తదితర ప్రాంతాలకు దూర భారం తగ్గుతుందని గ్రామస్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా తాను ఇటీవలే బాధ్యతలు స్వీకరించానని, వంతెన నిర్మాణ పనుల గురించి తెలియదని, తెలుసుకొని చెబుతానని తెలిపారు.


గత వర్షాకాలం వంతెన వద్ద వరద ఉధృతి (ఫైల్)

నిర్మాణం పూర్తయ్యేలా చూడాలి..

- సింగని మారుతి, గ్రామస్థుడు, ఫకీర్ కొండాపూర్



మా గ్రామానికి ఉన్న రెండు రోడ్డు మార్గాలు వర్షాకాలంలో వచ్చే వరదల వల్ల రాకపోకలు బంద్ అవుతున్నాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు, వంతెనకు అవతల వైపు ఉన్న పొలాలకు వెళ్లే రైతులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని వంతెన నిర్మాణం పూర్తయ్యేలా చూడాలి.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొడిమ్యాల, జూలై 25(ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. శుక్రవారం కొడిమ్యాల మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకానికి రేషన్‌కార్డు ప్రామాణికంగా ఉందన్నారు. గతంలో రేషన్ కార్డులో పేరు లేకపోవటంతో ప్రజలు చాలా మంది ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు. కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో రేషన్‌కార్డుల కోసం 55వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. 52 వేల రేషన్‌కార్డులు అప్రూవ్ అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూధన్‌గౌడ్, సీవిల్ సప్లై ఆఫీసర్ జితెందర్‌రెడ్డి, ఫారెస్టు రేంజర్ గులాం మొయినుద్దీన్, డీఎఫ్ఆర్వో ముషీర్ అహ్మద్, పలువురు సెక్షన్ ఆఫీసర్లు, తహసీల్దార్ ఎం. కిరణ్‌కుమార్, ఎంపీడీవో స్వరూప, ఆర్ఐ కరుణాకర్, కార్యదర్శి వంశీవర్ధన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గడ్డం జీవన్‌రెడ్డి, సింగిల్ విండోల చైర్మనులు రాజనర్సిగరావు, రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మల్లేశంయాదవ్, చంద్రమోహన్‌రెడ్డి, అజయ్‌గౌడ్, స్వామి, రవి, జితెందర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, నర్సయ్య, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు

ధర్మపురి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని షబ్బీర్ అహ్మద్ బేగ్‌కు చెందిన ద్విచక్ర వాహనం చోరీ కేసులో నిందితుడు గుర్రం కోటేశ్వర్‌రావుకు రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ ధర్మపురి కోర్టు జుడిసియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏగి జానకి శుక్రవారం తీర్పునిచ్చారు. గత ఏడాది మే 14 న షబ్బీర్ అహ్మద్ బేగ్ తన పల్సర్ బైక్‌ను ఇంటి ముందు పార్క్ చేసి ఉంచాడు. మరునాడు ఉదయం చూడగా కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ ఉదయ్‌కుమార్ నిందితుడు కోటేశ్వర్‌రావును అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు నిచ్చారు.

వానాకాలం విద్యుత్‌తో జాగ్రత్త

- రైతులు అప్రమత్తంగా ఉండాలి
- సొంతంగా మరమ్మతులు చేయొద్దు
- సిబ్బందికి సమాచారం ఇవ్వాలి

గణేశ్‌నగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వానాకాలం విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటాయి. వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలి. అనుభవం లేకుండా సొంతంగా మరమ్మతు చేస్తే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. భారీ వర్షాల నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు.

వర్షాకాలంలో ఈదురు గాలులతో చెట్లు విరిగి ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సమస్యలు తలెత్తుతాయి. దీంతో రైతులు చిన్నచిన్న మరమ్మతులు చేస్తుంటారు. అలాంటి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ల ఏబీ స్విచ్ పూర్తిగా నిలిచిపోక విద్యుదాఘాతానికి గురైై అవకాశాలు ఎక్కువ. ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతు చేయాల్సి వస్తే విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.





● పాటించాల్సిన ముఖ్యాంశాలు

ఎర్తింగ్ తప్పకుండా చేసుకోవాలి. వర్షం కురిస్తే స్విచ్ బోర్డు తడవకుండా జాగ్రత్తపడాలి. ట్రాన్స్‌ఫార్మర్, స్టార్టర్ బాక్స్ చుట్టూ పిచ్చి మొక్కలు, పొదలు పెరగకుండా చుడాలి. ఎలాంటి పరిస్థితిల్లోనూ తెగిన విద్యుత్ తీగలను తాకవద్దు. విద్యుత్ సిబ్బంది వచ్చే వరకు వాటి చుట్టూ ప్రమాద సూచికలను ఏర్పాటు చేయాలి. మూగజీవాలను విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరకు వెళ్లకుండా ఉండేలా చూసుకోవాలి. రైతులు, వినియోగదారులు సొంతంగా విద్యుత్‌కు సంబంధించిన పనులు చేయొద్దు. కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరం. గ్రామీణ వినియోగ దారులు తమ పరిధిలోని క్షేత్ర స్థాయి విద్యుత్ సిబ్బంది లైన్‌మన్, లైన్ ఇన్‌స్పెక్టర్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇంజనీర్, సెక్షన్ ఆఫీసర్‌ను సంప్రదించాలి.

అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారు



వచ్చే మూడు రోజులు అతి భారీ వర్షాలు ఉన్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు, ముఖ్యంగా రైతులు విద్యుత్‌పై జాగ్రత్త వహించాలి. విద్యుత్ సమస్య తలెత్తితే వెంటనే సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. తడి చేతులతో విద్యుత్ పరికరాలు, తీగలు, స్విచ్‌లను తాకకూడదు. ట్రాన్స్ ఫార్మర్లు, స్టార్టర్ బాక్సులు, మోటార్ల వద్ద అప్రమత్తంగా ఉండాలి. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉంటారు.

\- మేక రమేష్‌బాబు, టీజీఎన్‌పీడీసీఎల్, ఎస్ఈ

అత్యవసర సమయంలో ఫోన్ చేయాల్సిన నంబర్లు

ఎటువంటి విద్యుత్ సమస్య తలెత్తితే టీజీఎన్‌పీడీసీఎల్ టోల్ ఫ్రీ నంబరు 1912కు సంప్రదించాలని అధికారులు కోరుతున్నారు. నగరంలోని సంబంధిత అధికారులు, ఫ్యూజ్ ఆఫ్‌కాల్ నంబర్లు అందుబాటులో ఉంచారు.

ఏఈలు	ఫ్యూజ్ ఆఫ్‌కాల్ సిబ్బంది
టౌన్-1 8712483242,	8712483237
టౌన్-2 8712483270	7036117117
టౌన్-3 8712483215	8712483243
టౌన్-4 8712483276	8712483247
టౌన్-5 8712483251	8712483248
టౌన్-6 8712483280	8331012624
టౌన్-7 8712483284	9912225700
టౌన్-8 8712483256	9491011885
టౌన్-9 8712483289	8712483285

ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారిగా సర్ఫరాజ్ అహ్మద్

కరీంనగర్ అర్బన్, జూలై (ఆంధ్రజ్యోతి):తెలంగాణలోని ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారిగా సర్ఫరాజ్ అహ్మద్‌ను నియమించారు. ఈయన గతంలో కరీంనగర్ కలెక్టర్‌గా పనిచేశారు. కొద్ది రోజుల క్రితం ప్రత్యేక అధికారులను నియమించిన ప్రభుత్వం మళ్లీ కొద్ది మార్పులతో తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

తిరుపతి రైలుకు ఎల్‌హెచ్‌బీ బోగీలు..

ఈ నెల 27 నుంచి పట్టాలపై పరుగులు

పెద్దపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఇక నుంచి జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఎల్‌హెచ్‌బీ (లింక్ హాఫ్‌మన్ బుష్) బోగీలతో ఈ నెల 27 నుంచి తిరుపతి రైలు పట్టాలు ఎక్కనున్నది. 12761 నంబర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 26న తిరుపతి నుంచి బయలు దేరనున్నది. 27న రాత్రి కరీంనగర్ నుంచి తిరుపతి వెళ్లనుంది. ఇప్పటి వరకు ఈ రైలుకు ఐసీఎఫ్ (ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ) బోగీలు ఉన్నాయి. ఇక నుంచి ఎల్‌హెచ్‌బీ (ఎరుపు రంగు గలవి) బోగీలతో నడవనున్నాయి. ఈ రైలులో మొత్తం 19 బోగీలు ఉంటాయి. ఆరు స్లీపర్ బోగీలు,



ఐదు త్రీ టైర్ ఏసీ బోగీలు, మూడు టు టైర్ బోగీలు, నాలుగు జన రల్ బోగీలు, ఒక దివ్యాంగుల బోగీతో నడవనున్నది. ఎల్‌హెచ్‌బీ బోగీలు గరిష్ఠంగా 160 కిలోమీటర్ల వేగంతో, ఐసీఎఫ్ బోగీలు 110 కి.మీ వేగంతో నడుస్తాయి. కరీంనగర్ నుంచి పెద్దపల్లి వరకు 110 కి.మీ, పెద్దపల్లి నుంచి తిరుపతి వరకు 130 కి.మీ. వేగంతో ఈ రైలును నడపనున్నారు.

ఎస్సారెస్పీకి స్వల్ప వరద

ప్రాజెక్టులోకి 2,605 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శుక్రవారం స్వల్పంగా వరద చేరింది. డ్యామ్‌లోకి 2,605 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరి నీరు ప్రాజెక్టులోకి వస్తోంది. ప్రా జెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీల సామర్థ్యానికి గాను ప్రస్తుతం 21.541 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 25.960 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 622 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇదిలా ఉండగా జూన్ 1 నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 11.744 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 2.991 టీఎంసీల నీరును వ్యయం చేశారు.

ఆలయాల్లో శ్రావణ సందడి

- వేములవాడలో మహాలక్ష్మి అమ్మవారికి ఒడి బియ్యం
- ధర్మపురిలో ప్రారంభమైన ఉత్సవాలు
- కొండగట్టులో అభిషేక అర్చనలు



వేములవాడలో స్వామివారి దర్శనానికి క్యూలో భక్తులు

వేములవాడ కల్చరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం శుక్రవారం శ్రావణ శోభను సంతరించుకుంది. శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా రాజన్న ఆలయానికి భక్తులు తరలివచ్చారు. ఆలయ ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ఆయా క్యూలైన్ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు ముందుగా పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. గండాలు తొలగిపోవాలని గండాదీపంలో నూనె పోసి శ్రీస్వామి వారిని వేడుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు బద్దిపోచమ్మను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మహాలక్ష్మి అమ్మవారికి విశేషపూజలు..

శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా రాజరాజేశ్వరి అమ్మవారికి ఉదయం, సాయంత్రం విశేషపూజలు నిర్వహించారు. శ్రీమహాలక్ష్మి అమ్మవారికి షోడశోపచార పూజలు ఘనంగా నిర్వహించారు. మహిళలు మహాలక్ష్మి అమ్మవారికి నూతన వస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ధర్మపురిలో మంత్రి అడ్లూరి పూజలు

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో శ్రావణమాస ఉత్సవాలు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. శ్రావణమాసం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. నది వద్ద సైతక లింగాలు చేసి పసుపు, కుంకుమ చల్లి, కొబ్బెరికాయలు కొట్టి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అన్ని ఆలయాల్లో స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. రాత్రి వరకు ఆలయాలు భక్తి గీతాలతో ప్రతి ధ్వనించాయి. గోదావరి నదీ తీరాన గల ఆలయాల్లో భక్తులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ వేదపండితులు పాల్గొన్నారు. ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దర్శించుకున్నారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు.

కొండగట్టులో సప్తాహ ఉత్సవాలు...

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాస సప్తహ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఆలయ మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేక అర్చనలు నిర్వహించారు. సాయంకాలం అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన, వెంకటేశ్వరస్వామికి తిరువీధి సేవ నిర్వహించిన అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ ఉత్సవాలలో ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, చంద్రశేఖర్, సునీల్, స్థానాచార్యులు కపీందర్, ప్రధానర్చకులు రామకృష్ణ, జితేంద్రప్రసాద్, రఘు ఉప ప్రధాన అర్చకులు చిరంజీవి, మారుతీ ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.





ఆలయంలో సంకల్పాది పూజలు చేస్తున్న అర్చకులు, కొండగట్టులో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

క్రీడలతో స్నేహ సంబంధాలు

- కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ వెలిచాల రాజేందర్‌రావు
- సీబీఎస్ఈ క్లస్టర్-7 కబడ్డీ పోటీలు ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో స్నేహసంబంధాలు పెంపొందుతాయని కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని జగిత్యాల రోడ్‌లో వివేకానంద రెసిడెన్షియల్ (సీబీఎస్ఈ) పాఠశాలలో శుక్రవారం సీబీఎస్ఈ క్లస్టర్-7 బాలుర కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానంద రెసిడెన్షియల్ పాఠశాల 42 ఏళ్లగా ఉన్నతమైన విద్యతోపాటు అన్ని రకాల క్రీడలను ప్రోత్సహించడం గర్వకారణమన్నారు. అండర్-14, 17, 19 విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేల చొప్పున, ద్వితీయ స్థానం జట్టుకు రూ.8 వేల చొప్పున, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5 వేల చొప్పున నగదు బహుమతి ఇస్తామని ప్రకటించారు. రానున్న రోజుల్లో కరీంనగర్‌లో జాతీయ స్థాయి క్రీడలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ అమిత్‌కుమార్ మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహద పడుతాయన్నారు. వివేకానంద అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ టి. లలిత కుమారి మాట్లాడుతూ క్రీడలతో క్రమశిక్షణ, సొంత నిర్ణయాలు తీసుకునే నైపుణ్యం పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడ అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సీహెచ్ సంపత్‌రావు, జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి బి.మల్లేష్‌గౌడ్, సీబీఎస్ఈ పరిశీలకులు ఎల్. వెంకటరమణ, పాఠశాల చైర్మన్ డాక్టర్ పొల్సాని సుధాకర్‌రావు, ప్రిన్సిపాల్ బలివాడ రేణుక, పాఠశాల కమిటీ సభ్యులు గంద్ర లక్ష్మణరావు పాల్గొన్నారు.



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ప్రయాణ ప్రాంగణం గుంతలమయం

ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



వెల్గటూర్ బస్టాండ్‌లో గుంతలు

వెల్గటూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వెల్గటూర్ ప్రయాణ ప్రాంగణం గుంతలమయంగా మారింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు వచ్చి నపుడు తొందరగా ప్రయాణికులు ఎక్కడానికి ప్రయత్నిస్తే గుంతలో పడే ప్రమాదం ఉంది. మండల కేంద్రంలో నిత్యం బస్సులు నడిచే ప్రయాణ ప్రాంగణాన్ని పట్టించుకునే నాథుడు లేడని ప్రయాణికులు మండి పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై బస్టాండ్ కంట్రోలర్ బండారి సత్తయ్యను వివరణ కోరగా సమస్యను ఆర్టీసీ అధికారులకు దృష్టికి తీసుకవెళ్లామని అన్నారు. స్థానిక నాయకులు, వ్యాపారస్తులు బస్టాండ్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

రేపు అర్బన్ బ్యాంక్ సర్వసభ్య సమావేశం

కరీంనగర్ అర్బన్, జూలై 25 (ఆంధ్ర జ్యోతి): కరీంనగర్, జగిత్యాల, గంగాధర (మధురనగర్) బ్రాంచ్‌ల సహకార అర్బన్ బ్యాంక్ 42వ సర్వసభ్య సమావేశం ఈ నెల 27న కరీంనగర్ టీఎన్ జీఓస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి గడ్డం విలాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు టీఎన్జీ ఓస్ ఫంక్షన్ హాల్ నిర్వహించే సమావేశానికి సభ్యులు హాజరుకావాలని, బ్యాంకు అభివృద్ధి కోసం సమర్పించే ఎజెండాను ఏకగ్రీవంగా ఆమోదించాలని కోరారు.

నిరుపేదల సమస్యలపై ఎమ్మార్పీఎస్ పోరాటం

రేవంత్‌రెడ్డి సర్కార్‌తో తాడోపేడో తేల్చుకుంటాం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణమాదిగ

గోదావరిఖని, జూలై 25(ఆంధ్రజ్యోతి): నిరుపేదల సమస్యలపై ఎమ్మార్పీఎస్ పోరాడుతుందని, దేశంలో ఎదురయ్యే సవాళ్లనే ఎదుర్కొవడమే తన భవిష్యత్ ప్రయాణమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మంద కృష్ణమాదిగ అన్నారు. సింగరేణి మాదిగ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మార్కండేయకాలనీలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన సభలో ప్రసంగిం చారు. ఏబీసీడీ వర్గీకరణ కోసమే కాకుండా సమాజంలో అన్ని వర్గాల నిరుపేదల సమస్యలపై ఎమ్మార్పీఎస్ పోరాటం చేసి పరిష్కరించిందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఎన్నో వాగ్దానాలు నిలబెట్టుకోవడం లేదన్నారు. వికలాంగులకు, వితంతులకు పెన్షన్లు పెంచలేదని, కనీసం ఇవ్వాల్సిన పెన్షన్ల ఇంత వరకు ఇవ్వడం లేదని, ఈ విషయంలో ప్రతిపక్షం ప్రశ్నించడం లేదన్నారు. ఐదేళ్ళుగా కొత్త పెన్షన్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పేద వర్గాల సమస్యలే ఎమ్మార్పీఎస్ ఏజెండాగా మారుతుందని, ఆగస్టు 13న వికలాంగుల, వృద్ధుల, వితంతుల పెన్షన్ల కోసం మహాగర్జన నిర్వహిస్తామని, హామీ ఇచ్చిన ప్రకారం ఇప్పటికైనా పెన్షన్ పెంచుతావా లేకపోతే రాజీనామా చేసి పోతావా అనే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో తేల్చుకోవడం కోసమే మహాగర్జన నిర్వహిస్తున్నామని తెలిపారు.

తనకు పద్మశ్రీ ఏబీసీడీ వర్గీకరణతో రాలేదని, 30 ఏళ్ల ఎమ్మార్పీ ఎస్ చేసిన సామాజిక పోరాటాలకు కేంద్రప్రభుత్వం ఇచ్చిన గుర్తింపు అన్నారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య, మాజీ ఎంపీ వెంకటేష్‌నేత, తిరుపతి, యాదగిరి సత్తయ్య, బొంకూరి శంకర్, తిరుపతి, పాముకుంట్ల భాస్కర్, యుగేందర్, బాలసాని స్వామిగౌడ్, కాసిపేట శివాజీ, ప్రసాద్, దళిత సంఘాలు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మందకృష్ణ

త్యాగాల స్మృతి చిహ్నం.. వైజయంతి యుద్ధ ట్యాంక్

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

కార్గిల్ పర్వత ప్రాంత్రాన్ని ముట్టడించిన పాకిస్థాన్ చొరబాటుదారులను భారత్ సైన్యం తరిమి కొట్టింది. 1999 జూలైలో జరిగిన ఇండో-పాకిస్థాన్ యుద్ధంలో భారత్ సైన్యం త్యాగాలకు ప్రతిరూపంగా సిరిసిల్లలో త్యాగాల స్మృతి చిహ్నం ఏర్పాటు చేశారు. 2004లో కార్గిల్ వీరుల స్మృత్యార్థం సిరిసిల్లలోని వర్ధనకుంటను కార్గిల్ లేక్‌గా అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. కార్గిల్ లేక్‌లో యుద్ధ సమ యంలో ఉపయోగించిన వైజయంతి యుద్ధ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. సిరిసిల్ల-కామారెడ్డి రహదారి పక్కన ఉన్న వర్ధనకుంటకు కార్గిల్‌లేక్‌గా నామకరణం చేసిన అప్పటి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా సీహెచ్ విద్యాసాగర్‌రావు కార్గిల్ యుద్ధంలో ఉపయోగించిన 45 టన్నుల వైజయంతి యుద్ధ ట్యాంక్‌ను సిరిసిల్లకు తీసుకువచ్చారు. యువతలో దేశభక్తిని పెంపొందించడానికి, అమరసైనికులకు నివాళులు తెలుపుతూ ఏర్పా టు చేశారు. ఇప్పు డు సిరిసిల్లకు ప్రత్యేక ఆకర్షణగా యువకులు, విద్యార్థులు, సైనికుల కు స్ఫూర్తినిచ్చే విధంగా మారింది. కార్గిల్ లేక్ విజయానికి స్ఫూర్తిగా జూలై 26న కార్గిల్ విజయ్ దివస్‌ను దేశ వ్యాప్తంగా జరుపుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ప్రధాన రహదారుల విస్తరణ, ప్రధాన కూడళ్ల సుందరీకరణలకు పూనుకున్నారు. దీంతో పాటు కార్గిల్‌లేక్ వద్ద వైజయంతి యుద్ధట్యాంక్ ప్రాంతాన్ని రూ.21 లక్షలతో పురపాలక సంఘం అభివృద్ధి చేసింది. చుట్టూ ప్రహరీ, చెట్లతో తీర్చిదిద్దారు. బీజేపీ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలను నిర్వహిం చడానికి ఏర్పాట్లు చేశారు.



ఆర్టీసీ డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ శిబిరం

భగత్‌నగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. శుక్రవారం 'ఆరోగ్యం-ఉద్యోగం' అనే అంశంపై వీడియో కాన్ఫరెన్స్‌లో వివ రించారు. సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఏవీ గిరిసింహా రావు కంటి చూపుపై పొగాకు, మందు ప్రభావాన్ని వివరించారు. పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, అకౌంట్స్ ఆఫీసర్ శంకరయ్య, సైకాలజిస్టు నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

అక్షరాస్యత వైపు అతివలు..

(5వ పేజీ తరువాయి)

నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఉల్లాస్ కార్యక్రమాన్ని తీసుకువచ్చింది. పదో తరగతిలో మానేసిన వారిని ఓపెన్ స్కూల్ విధానంలో పదో తరగతి తర్వాత ఇంటర్మీడియట్ బోధన అందిస్తారు. ఇప్పటి వరకు పదోతరగతి విద్యను అందించడానికి 1,184మంది, ఇంటర్మీడియట్ 722 మందిని గుర్తించారు. మహిళా సంఘాల్లో పూర్తిగా నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పడానికి 1,229 మంది వలంటీర్లను కూడా గుర్తించారు. వీరిలో 628 మంది వలంటీర్ల వివరాలను ఉల్లాస్ యాప్‌లో నమోదు చేశారు. వీరితో పాటు ప్రతి జిల్లా నుంచి డీఆర్‌పీలుగా ముగ్గురు టీచర్లకు శిక్షణ ఇవ్వ నున్నారు. ఈనెల 31లోపు మండల గ్రామస్థాయిలో కూడా శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేస్తారు. నిరక్షరాస్యులకు ప్రతిరోజు రెండు గంటల చొప్పున బోధన అందిస్తారు. తరగతుల నిర్వహ ణకు ప్రభుత్వ పాఠశాలలు, కమ్యూనిటీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి డిజిటల్ అక్షరాస్యతను అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎరువుల నిల్వలు, విక్రయాల తనిఖీ



నేరెళ్లలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ప్రసాద్



పెద్దూర్ సింగిల్‌విండో కార్యాలయంలో ఎరువులను పరిశీలిస్తున్న అధికారులు

తంగళ్లపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం నేరెళ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని కోఆపరేటివ్ సొసైటీస్ జాయింట్ రిజిస్ట్రార్, ఎరువుల తనిఖీ ప్రత్యేకాధికారి ఎస్‌వీ ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీచేశారు. వ్యవసాయ ఉత్పత్తుల కమిషనర్, రాష్ట్ర కార్యదర్శి ఆదేశాల మేరకు కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎరువులు, నిలువలు, విక్రయాలపై తనిఖీ అధికారిగా ఎస్‌వి ప్రసాద్‌ను నియమించారు. దీంట్లో భాగంగా శుక్రవారం నేరెళ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని పరిశీలించి ఎరువుల నిల్వల రికార్డులను తనిఖీ చేశారు. గోదాంలోనే నిల్వ ఉన్న ఎరువులను పరిశీలించారు. ఈ తనిఖీలో జిల్లా సహకార అధికారి టి రామకృష్ణతో పాటు ప్యాక్స్ చైర్మన్ కోడూరి భాస్కర్‌గౌడ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రమాదేవి, సంఘం కార్యదర్శి అజయ్, సిబ్బంది అంజయ్య, రాజయ్య, సాయిలు ఉన్నారు.

● వేములవాడ టౌన్ : వేములవాడ పట్టణంలోని నాంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలోని ఎరువులగోదాంను కోఆపరేటివ్ జాయింట్ రిజిస్ట్రార్ ఎస్‌వీ ప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. ఎరువుల రికార్డులను పరిశీలించారు. జిల్లా సహకార అధికారి రామకృష్ణ, సింగిల్‌విండో చైర్మన్ బీరెడ్డి సల్మాన్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు, అధికారులు ఉన్నారు.

● సిరిసిల్ల రూరల్ : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ సింగిల్ విండో కార్యాలయంలోని ఎరువులను శుక్రవారం జిల్లా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రామచంద్రం తనిఖీలు చేసి ఎరువుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. సింగిల్‌విండో చైర్మన్ జీల కిషన్‌యాదవ్, వైస్ చైర్మన్ బెజ్జారపు నారాయణగౌడ్, సీఈవో చిలుక గౌరిశంకర్, లింగంపల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కిట్ల పంపిణీ

సిరిసిల్ల రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్ కిట్‌లను శుక్రవారం బాలింతలకు అందజేశారు. మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ జన్మదినం సందర్భంగా అందించిన కేసీఆర్ కిట్‌లను గ్రామంలోని బాలింతలకు ఇళ్లకు నాయకులు వెళ్లి వారికి అందజేశారు. సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ ఎరవెల్లి వెంకట రమణారావు, మాజీ కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, తమ్మెట జీవన్, మేడుదుల దేవయ్య, అదిపెల్లి దేవయ్యగౌడ్, లడ్డు, షేక్ అలీ, ముష్కం సత్తయ్యగౌడ్ డిష్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామంలో కేటీఆర్ జన్మదినం సందర్భంగా కేసీఆర్ కిట్లను బాలింతలకు శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బైరగోని రమేష్, మరాఠీ మల్లిక్, ముత్యాల నరేష్, బండి శ్రావణ్ పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలంలోని పెద్దలింగాపూర్‌లో శుక్రవారం బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్ కేసీఆర్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు బొప్ప శ్రీనివాస్, మాతిరెడ్డి కిషన్‌రెడ్డి, మీనరగండ్ల అనీల్‌కుమార్, ఎలవేని రమేష్, ఎద్దు కుమార్, రేగుల బిక్షపతి, ల్యాగల బాగయ్య, కేతిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పసుల బాలరాజు, శ్రీకాంత్, రాజు, రవీందర్‌రెడ్డి, శ్రీధర్, మహేందర్, రాజయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాపై దృష్టి సారించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో సందీప్

కోనరావుపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రైతులు నానో యూరియాపై దృష్టి సారించాలని వ్యవసాయ అధికారి సందీప్ అన్నారు. మండలంలోని రైతు వేదికలో నానో యూరియాపై డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూరియా వాడకం వల్ల భూసారం తగ్గుతుందన్నారు. వాతావరణం కాలుష్యం కాకుండా నానోయూరియా స్ప్రే చేయడంవల్ల భూసారం పెరగడంతో పాటు మొక్క ఆశాజనకంగా పెరుగుతుందని అన్నారు. 500 మిల్లీ లీటర్ల నానో యూరియా బాటిల్ 45 కిలోల యూరియాతో సమానమని అన్నారు. యూరియా బస్తా వాడడం వల్ల భూసారం తగ్గి వాతావరణం కాలుష్యం ఏర్పడుతుందని అన్నారు. అందుకే రైతులు నానో యూరియాపై దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పెస్టిసైడ్స్ ఫర్టిలైజర్ డీలర్లు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు..

ఇల్లంతకుంట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రైతులందరికి సరిపడా యూరియా అందుబాటులో ఉన్నందున ఎవరూ ఆందోళన చెందవద్దని వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ముస్కానిపేట గ్రామంలో శుక్రవారం ఎరువుల విక్రయకేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ కేంద్రాలలో 500 మెట్రిక్ టన్నుల యూరియా నిలువ ఉందన్నారు. వర్షాలు పడుతున్నందున యూరియాను వరిచేలల్లో చల్లవద్దని, వర్షాలు తగ్గిన తర్వాత చల్లాలని సూచించారు. పత్తిపంటలో అధిక నీరు నిలువ ఉండటం వల్ల మొక్కలు వడలిపోయే ప్రమాదం ఉన్నందున రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

వ్యవసాయాధికారుల తనిఖీలు

వేములవాడ టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా ఎరువులు అమ్ముతున్న దుకాణంపై కేసు నమోదు చేసినట్లు వేములవాడ వ్యవసాయాధికారి సాయికిరణ్ తెలిపారు. పట్టణంలోని ఓ దుకాణాన్ని జిల్లా వ్యవసాయాధికారిని అఫ్జల్ బేగం తనిఖీ చేశారు. లైసెన్స్, పలు రికార్డులను పరిశీలించగా ఎరువులు అమ్మేందుకు అనుమతులు లేవని, లైసెన్స్ రసీదులు లేకుండా ఉన్న ఎరువుల స్టాక్‌ను గుర్తించి సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎరువులను అధికంగా వాడొద్దు..

వీర్నపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు పంటపొలాలకు సామర్థ్యానికి మించి ఎరువులను అధికంగా వాడొద్దని జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌భేగం అన్నారు. వీర్నపల్లి మండలంలో నాటు వేస్తున్న పంట పొలాలను శుక్రవారం పరిశీలించి రైతులతో ఆమె మాట్లాడారు. మండలకేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రైతులు వర్షాల కురిసే అవకాశం ఉన్నందున 3రోజులపాటు పంటపొలాలకు యూరియాను వేయద్దన్నారు. వెంట మండల వ్యవసాయాధికారి జయ, ఏఈవోలు ఉన్నారు.

విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా - ఏకలవ్య పాఠశాలలో ఆన్‌లైన్ కోచింగ్ తరగతులు ప్రారంభం



పాఠశాలలో వంట గదిని పరిశీలిస్తున్న కలెక్టర్



ఆన్‌లైన్ తరగతులను ప్రారంభించి మాట్లాడుతున్న కలెక్టర్

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆన్‌లైన్ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని పోటీ పరీక్షల్లో రాణించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆన్ అకాడమీ పేరుతో జేఈఈ మెయిన్స్, నీట్ పోటీ పరీక్షలకు ఆన్‌లైన్ కోచింగ్ తరగతులను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం పాఠశాలలోని వంటగది, స్టాక్ రూం, మధ్యాహ్న భోజనం పరిశీలించి, సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కాసేపు ముచ్చటించి పలు సబ్జెక్టులపై ప్రశ్నించారు. 8వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు ఆన్‌లైన్ కోచింగ్ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. జిల్లాలోని మిగిలిన 26 రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఈ శిక్షణ ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, ఇంచార్జి ప్రిన్సిపాల్ రాంసూరత్‌యాదవ్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక, మట్టి కొరత రాకూడదు

వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక, మట్టి కొరత రాకుండా చూడాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. వీర్నపల్లి మండలం సీతారాంనాయక్ తండా, ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామం తుర్కాశి కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు. గ్రామాల్లో నిర్మించే కొన్ని ఇళ్లకు బేస్‌మెంట్ నింపడానికి మట్టి సరిపోవడం లేదని లబ్ధిదారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందిరమ్మ ఇళ్లకు అవసరమైన ఇసుక, మట్టి కోసం పంచాయతీ కార్యదర్శులు అంచనా వేసి తహసీల్దార్లకు దరఖాస్తులను పంపించాలన్నారు. స్థానిక ఎంపీడీవోలు ఇళ్ల నిర్మాణాల ప్రగతిని నిత్యం పర్యవేక్షణ చేయాలని సూచించారు.

మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



పురుషోత్తంను సన్మానిస్తున్న జిల్లా అధ్యక్షుడు, నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : చలో వేములవాడ మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి వెళుతున్న మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తం శుక్రవారం అంబేద్కర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు మొట్టమొదటి సారిగా రాష్ట్ర అధ్యక్షుడిగా రావడంతో సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో పురుషోత్తంతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు స్వాగతం పలికారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం వేములవాడకు సంఘం నాయకులు, సభ్యులతో కలిసి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం నర్సయ్య, దుమాల శ్రీకాంత్, లింగంపల్లి సతీష్, చొక్కి శ్రీనివాస్, శీలం రాజు, అగ్గిరాములు, కల్లూరి రాజు, కల్లూరి మధు, కూస మహేష్, నీలి రవీందర్, మిద్దె శ్రీనివాస్, గోక లక్ష్మీరాజం, బండారి బాల్‌రెడ్డి, పల్లికొండ నర్సయ్య, సిరిసిల్ల పట్టణ, మండలాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమ పూజలు



పూజలు నిర్వహిస్తున్న మహిళలు

చందుర్తి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం మల్యాల గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం మహిళలు కుంకుమ పూజలను ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసంలో మొదటి శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీదేవికి అర్చకులు కందాలై వెంకటరమణాచారి ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణల మధ్య మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.

ఇళ్లలోకి వరద నీరు.. తప్పని ఇబ్బందులు..



సిరిసిల్ల ఇళ్లలోకి చేరిన వర్షం నీరు

సిరిసిల్ల టౌన్,జూలై 25(ఆంధ్రజ్యోతి) :జిల్లా కేంద్రంలో ఏ చిన్నపాటి వర్షం పడిన ఇండ్లలోకి వర్షం నీరుతో పాటు మురికి నీరు రాక తప్పడం లేదు. ఆ ప్రాంత ప్రజలు మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే లేడు. సోషల్ మీడియా ద్వారా కూడా మున్సిపల్ అధికారులకు వారి ఇబ్బందులను తెలియజేసినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. శుక్రవారం కురిసిన వర్షంతో జిల్లా కేంద్రంలోని సర్దార్ నగర్ తారకరామ మల్టీ స్పెషల్ ఆసుపత్రి వెనక వీధిలోని మురికి కాలువలు నిండుకొని ఇంటిలోకి వర్షం నీరు మురికి నీరు చేరింది. ఏ చిన్న వర్షం పడిన మురికికాలువలు నిండుకొని వర్షం నీరుతో పాటు మురికి నీరు చేరుతుంది. దీంతో తరచూ ఇంట్లోకి వస్తున్న మురికి నీరును ఇంటి యజమానులు ఎత్తు పోసుకుంటున్నారు. మురికి కాలువల నిర్మాణం సరిగాలేకపోవడం వల్లే వర్షం నీరు, మురికినీరు ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'స్థానిక' ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజు

ఇల్లంతకుంట, జూలై 25(ఆంధ్రజ్యోతి) స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడిచర్ల రాజు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని రాజరాజేశ్వర కళ్యాణ మండపంలో శుక్రవారం మండలశాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు కాంగ్రెస్ పరిపాలనల పట్ల ప్రజలు విసుగుచెందారన్నారు. మండలశాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్, బత్తిని సాయగౌడ్, నాగసముద్రాల సంతోష్, మ్యాకల మల్లేశం, దేశెట్టి శ్రీనివాస్, ముత్తవ్వ, మామిడి హరీష్, మాజీ సర్పంచ్‌లు కాసం శ్రీనివాస్‌రెడ్డి, చింతలపల్లి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

సదస్సును విజయవంతం చేయాలి

కోనరావుపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వికలాంగుల చేయూత పెన్షన్‌దారుల సింహగర్జన సన్నాహక సదస్సు ఈనెల 27న జరుగనున్నదని, సదస్సుకు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ హాజరవుతారని, దీన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కొమ్ము రాజశేఖర్, వలియా నాయక్ కోరారు. కోనరావుపేటలో శుక్రవారం వికలాంగుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. బాలచందర్, మనోహర్, విజయ్ పాల్గొన్నారు.

ఎరువులను వినియోగించవద్దు

సిరిసిల్ల రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు కురుస్తున్నందున పంటలు సాగుచేసిన రైతులు ఎరువులను వినియోగించవద్దని జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా రైతులు పంటలను సాగు చేయడం జరిగిందని ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వర్షాలు ఎక్కువగా కురుస్తున్నందున యూరియా, లేదా ఇతర ఎరువులను ఇప్పుడు పంటలకు వేయవద్దని కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సిరిసిల్ల రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు అధికంగా కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలందరు తమ ఇళ్ల పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని వార్డు అధికారి రాములు కోరారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ఒకటవవార్డు జ్యోతినగర్‌లో శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని చేపట్టారు. జ్యోతినగర్‌లో చెత్తాచేదారంతో నిండిపోయిన పరిసరాల పరిశీలించడంతోపాటు ఇళ్లలో నీటినిల్వలు, కుండీలను పరిశీలించి సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎం శ్రావణి, ఆశవర్కర్‌లు కళా, లలిత పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), జూలై25, (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలను అమ్ముతున్న ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గాంతుల మహేష్ డిమాండ్ చేశారు. ఎంఈవో ఆఫీసుకు సమీపంలోని ఓగదిలో పుస్తకాలను డంపు చేసి ఉంచడంతో డీవైఎఫ్‌ఐ నాయకులు అక్కడకు వెళ్లి ఎంఈవోకు సమాచారం అందించారు. మండల వనరుల కేంద్రం సిబ్బంది అక్కడకు చేరుకొని పాఠ్యపుస్తకాలను డంపుచేసి అమ్ముతున్నారని మండల విద్యాధికారి కృష్ణహరికి తెలిపారు. ఎంఈవో ఆదేశాలతో పుస్తకాలు ఉన్న గదిని సిబ్బంది సీజ్ చేశారు. అధిక ధరలకు పుస్తకాలను విక్రయిస్తే సమాచారం అందించాలని ఎంఈవో పేర్కోన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్ గ్రామంలో కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొలకాని రవిని నాయకులు శుక్రవారం పరామర్శించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ మెండె శ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షుడు సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

అర్చకులకు వేతనాలు పెంచాలి

గంభీరావుపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఆలయ అర్చకులకు వేతనాలను పెంచాలని దూప దీప నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు రాచర్ల పార్థసారథిశర్మ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం సంఘం జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. పార్థసారథి శర్మ మాట్లాడుతూ అర్చకులందరికి కనీస వేతనాన్ని, ఉద్యోగ భద్రత కల్పిస్తూ హెల్త్‌కార్డులు మంజూరుచేయాలన్నారు. సమావేశంలో గౌరవ అధ్యక్షుడు కొండమాచారీ, ఉపాధ్యక్షులు బిట్కూరీ గోపాలాచార్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్ గొంగోళ్ళ రవి, ప్రధాన కార్యదర్శి పరాంకుశం రమేష్, కోశాధికారి కందాలై వెంకటరమణాచార్యులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంగళం సంతోష్‌శాస్త్రి పాల్గొన్నారు.

రేపు బీడీ వర్కర్స్ యూనియన్ మహాసభ

వీర్నపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బీడీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 27న నిర్వహిస్తున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, ప్రజాసంఘాల నాయకుడు మల్లారపు అరుణ్ కుమార్ కోరారు. మండలకేంద్రంలో బీడీ వర్కర్స్‌తో కలిసి ఆయన కరపత్రాలను శుక్రవారం విడుదల చేశారు. బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం ఆగదన్నారు.

యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిపై ఫిర్యాదు

బోయినపల్లి జూలై 25 (ఆంధ్రజ్యోతి) : కేటీఆర్ జన్మదిన వేడుకల సందర్భంగా పంపిణీ చేసిన కేసీఆర్ కిట్లపై జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కౌడగాని వెంకటేష్ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేశాడంటూ ఎస్ఐ రాజ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. బోయినపల్లి గ్రామానికి చెందిన కన్నం విద్యాసాగర్, వెంకటేష్ ఆరోపణలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

సిరిసిల్ల పద్మశాలి సంఘం ఎన్నికలపై కోర్టు స్టే

సిరిసిల్ల క్రైం, జూలై 25(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పద్మశాలి సంఘం ఎన్నికలపై స్టే విధిస్తూ శుక్రవారం సాయంత్రం జిల్లా కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. పద్మశాలి సంఘం ఎన్నికలను సవాల్ చేస్తూ చిమ్మని ప్రకాశ్, కోడం రవిలు జిల్లా కోర్టును ఆశ్రయించారు. ఈమేరకు న్యాయవాదులు సంగీతం సాయిరాం, ఇప్పకాయల భరత్‌కుమార్ ద్వారా దాఖలు చేసినటువంటి పిటీషన్‌లను స్వీకరించింది. ఇరువురి వాదనలను విన్న జిల్లా కోర్టు ఈనెల 27, ఆదివారం జరగాల్సిన సిరిసిల్ల పద్మశాలి సంఘం ఎన్నికలపై యథాస్థితిని కొనసాగించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ కేసును ఆగస్టు 4వ తేదీకి వాయిదా వేశారు.

ఉచిత వైద్యశిబిరం

ఇల్లంతకుంట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్ళపెల్లి గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటుచేసిన గుండె వైద్యశిబిరంలో 150మందికి ఈసీజీ, 2 డీఎకో, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారిసాయి, మెడికవర్ సెంటర్‌హెడ్ గుర్రం కిరణ్, కోట కర్నాకర్, లక్ష్మీరాజం, శ్రీకాంత్ పాల్గొన్నారు..

రేషన్ కార్డుల పంపిణీ

ముస్తాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా అందించలేదని ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మోయినికుంట గ్రామంలో శుక్రవారం లబ్దిదారులకు రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు మెర్గు యాదగిరిగౌడ్, మహిళా అధ్యక్షురాలు అనిత, బండి లక్ష్మీపతి, కదిరే సత్యంగౌడ్, మిరుదొడ్డి భాను, ఉచ్చిడి బాల్‌రెడ్డి, మెర్గు సత్యంగౌడ్ పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో వైద్య శిబిరం

కోనరావుపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మామిడిపల్లి, నిజామాబాద్, కొలనూరు గ్రామాల్లో వైద్యాధికారి వేణుమాధవ్ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బోరు బావి పనులకు భూమి పూజ

వేములవాడ రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ నిధులతో నూకలమర్రి గ్రామంలో బోరు బావి తవ్వక పనులకు బీజేపీ మండల అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. మాజీ ఎంపీపీ బండ మల్లేశం, అధికార ప్రతినిధి సుంకరి నరేందర్, ప్రధానకార్యదర్శి వనపర్తి పరుశరాములు, ఉపాధ్యక్షులు పల్లికొండ నారాయణ, లింగంపల్లి కుంటయ్య పాల్గొన్నారు.

కార్యవర్గం

వేములవాడ రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మండల కురుమ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా దానె తిరుపతి, ఉపాధ్యక్షుడిగా ఎగుర్ల రాజు, ప్రధాన కార్యదర్శిగా గుంటి వంశీకృష్ణ, సహాయ కార్యదర్శిగా ఇరుమళ్ల మల్లేశం, కోశాధికారిగా కట్లె బాలకిషన్, సలహాదారుగా కొరె తిరుపతి, కార్యనిర్వాహణ సభ్యులుగా ఒళ్లెం నాగరాజు, జక్కుల తిరుపతి, ఎగుర్ల రాజు, గుంటి కనుకయ్య, బైరి హనుమయ్య, ముత్తా రజిత, ఇరుమళ్ల పవిత్రలు ఎన్నికయ్యారు. నూతన కమిటీకీ మాజీ అధ్యక్షుడు జక్కుల తిరుపతి శుభాకాంక్షలు తెలిపారు.

నీటిని విడుదల చేయాలి

ఇల్లంతకుంట, జూలై 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కందికట్కూర్ గ్రామ సమీపంలోని మధ్యమానేరు కుడికాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని వంతడుపుల గ్రామ రైతులు వినతిపత్రం ఇచ్చారు. రైతులు శుక్రవారం మధ్యమానేరు ప్రాజెక్టు వద్దకు వెళ్లి ఏఈలు ప్రదీప్, అనుపమలను కలిసి సమస్యలు విన్నవించారు. రైతులు భాస్కర్‌రెడ్డి, మడ్కాడి రవి, రవీందర్‌రెడ్డి, చిమ్మనగొట్టు శ్రీనివాస్, సింగిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, మిట్టపల్లి మధు, పండుగ నరేష్, యాద అంజనేయులు, పండుగ పర్శరాం, రాంరెడ్డి, అంజిరెడ్డి, కనుకయ్య పాల్గొన్నారు.

మత్తడి దూకుతున్న ఊర చెరువు

చందుర్తి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండల వ్యాప్తంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, చెరువులు మత్తడి దుంకుతున్నాయి. చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలోని ఊర చెరువు నిండుకుండల మారింది. వరద నీటికి పూర్తిగా నిండిన ఊర చెరువు మత్తడి దూకుతోంది.